# మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

ఆలేరు రూరల్ : మాజీ సర్పంచులను అరెస్టు చేసిన పోలీసులు

భూదాన్ పోచంపల్లి : మాజీ సర్పంచులను పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

తుర్కపల్లి, నవంబర్ 4 : మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పెండింగ్ బిల్లులను చెల్లించాలని నిరసన తెలిపేందుకు చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనకుండా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోగుల ఆంజనేయులు అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా పెండింగ్ బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. మాజీ సర్పంచ్‌లు ఇమ్మడి మల్లప్ప, బిచ్చూ నాయక్, మేకల బాలకృష్ణ, రాంజీ, శంకర్‌నాయక్, భాస్కర్‌నాయక్, మహేందర్ అరెస్టయ్యారు.

● ఆలేరు టౌన్ : ప్రగతి భవన్ ముట్టడికి వెళ్తున్న మండల మాజీ సర్పంచ్‌లను సోమవారం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. మాజీ సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు బక్క రాంప్రసాద్ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయినవారిలో కోటగిరి పాండరి, ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి, కర్రె అశోక్, తదితరులున్నారు.

● భూదాన్‌పోచంపలి : చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి వెళ్తున్న మండలానికి చెందిన మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేసి బేగం బజార్‌లోని షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మన్నె పద్మారెడ్డి, గోడల ప్రభాకర్, మట్ట సుదర్శన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీసీఈఓ శోభారాణి

# సర్వేను సమర్ధవంతంగా చేపట్టాలి

● జడ్పీ సీఈఓ శోభారాణి

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 4 : సమగ్ర కుటుంబ సర్వేను సమర్ధవంతంగా చేపట్టాలని జడ్పీసీఈఓ శోభారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వేకు సంబంధించి ఎన్యుమరేటర్లు, ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లకు సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఓ శ్యామ్యూల్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, ఎంపీఓ దినకర్‌గౌడ్, మాస్టర్ ట్రైనర్లు నరేందర్‌రెడ్డి, బాల్‌నర్సయ్య పాల్గొన్నారు.

చౌటుప్పల్, నవంబర్ 4 : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కుటుంబ సర్వేకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ కే.నర్సింహారెడ్డి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ గురువారావు, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ట్రైనింగ్ ఆఫీసర్ నరేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : సమగ్ర కుటుంబ సర్వేపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎన్యుమరేటర్లకు ఎంపీడీఓ రాములునాయక్ అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంఈఓ కె.మహదేవరెడ్డి, సూపరిండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, శిక్షకుడు ఉమాశంకర్, ఏఎస్ఓ సంతోశ్‌కుమార్ పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు కుటుంబ సర్వేపై మండల ప్రత్యేకాధికారి గుర్రం సురేశ్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీడీఓ జాన్సీలక్ష్మీబాయి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ మాలతి, సూపరిండెంట్ వినోద్‌రెడ్డి, టీఓటీ రాజు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్యుమరేటర్లకు ఎంపీడీఓ రాజాత్రివిక్రమ్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేకాధికారి జ్యోతికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ రోజారాణి, ఏఎస్ఓ శారద, ట్రైనర్ దినేశ్‌బాబు, జ్ఞాన ప్రకాశ్‌రెడ్డి, వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మోత్కూరు : మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్‌లో ఎన్యుమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్ల మండల ప్రత్యేకాధికారి పీ యాదయ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంఈఓ టి.గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎం) : స్టేజీకి దూరంగా ఆపిన బస్సులో ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

# ప్రయాణానికి పాట్లు

ఆత్మకూరు(ఎం), నవంబర్ 4 : దీపావళి పండుగకు ఇండ్లకు వచ్చిన ప్రజలు తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వైపు వెళ్లేందుకు సోమవారం నానా పాట్లు పడ్డారు. మండల కేంద్రంలోని మోత్కూర్–భువనగిరి ప్రధాన రోడ్డు వద్ద ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులు ఎంతకూ ఆపక పోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎక్స్‌ప్రెస్ బస్సులు ఖాళీగా వెళ్తున్నా కూడా ఆపడం లేదని ప్రయాణికులు అంటున్నారు. ఒకటి, రెండు ఆర్డినరీ బస్సులు జనం నిలబడిన స్టేజీ వద్ద కాకుండా దూరంగా నిలుపడంతో పరిగెత్తి వెళ్లి ఎక్కేలోపు బస్సు వెళ్లిపోతుందని ప్రజలు మండి పడుతున్నారు. యువకులు పరిగెత్తి ఎక్కగలరని తమ లాంటి వృద్ధులు, మహిళల పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. బస్సుల సంఖ్యను పెంచి, అన్ని స్టేజీల ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

## పరిశోధనాత్మక ఆలోచనను పెంపొందించుకోవాలి : సైంటిస్ట్ రాణి

ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఐఐసీటీ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ వత్సల రాణి

చౌటుప్పల్‌రూరల్, నవంబర్ 4 : విద్యార్థులు శాస్త్రీయ రంగంలో పరిశోధనాత్మమైన ఆలోచనలను పెంపొందించుకోవాలని ఐఐసీటీ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ వత్సల రాణి అన్నారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆఫ్ న్యూఢిల్లీ సహకారంతో సైన్స్ అండ్ టెక్ సిరీ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన సైన్స్‌మేళాకు బుధవారం ఆమె హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో 100 పరిశోధనలను ప్రదర్శించారు. వీటిని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ నాగేశ్వర్‌రావు, బాషిపాక ఎల్లేశ్, అనిల్, పాఠశాల హెచ్ఎం శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సేద తీరేందుకు నాగులకుంట సుందరీకరణ : మున్సిపల్ చైర్మన్

పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, నవంబర్ 4 : ప్రజలు సేద తీరేందుకు నాగులకుంట సుందరీకరణ చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని కుంట సుందరీకరణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. వార్డు కౌన్సిలర్లు, నాయకులున్నారు.

# ప్రజావాణి సమస్యలపై సత్వరమే స్పందించాలి

● కలెక్టర్ హనుమంతరావు

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 4 : ప్రజావాణి సమస్యలపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుంచి ఆయన వినతులను స్వీకరించి మాట్లాడారు. మొత్తం 48 ఫిర్యాదులు అందాయని, రెవెన్యూ శాఖ– 24, మున్సిపాలిటీ– 5, పంచాయతి – 5, గ్రామీణ అభివృద్ధి శాఖ– 3, సర్వే ల్యాండ్ రికార్డ్– 2, ఎక్సైజ్, సంక్షేమ, వ్యవసాయ, మైనింగ్, వైద్య, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్, ఆర్టీసీ శాఖలకు ఒక్కో అర్జీ వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఏసీ గంగాధర్, రెవెన్యూ ఏసీ వీరారెడ్డి, జడ్పీసీఈఓ శోభారాణి, అధికారులు జగన్మోహన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో కార్తిక మాసం పూజలు

శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబర్4 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయంలో కార్తికమాసం మొదటి సోమవారం సందర్భంగా స్వయంభూ ఆల యం, అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశా రు. శివుడికి దీపారాధన చేసి కొండ కింద మండపంలో సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపారు. స్పటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం చేసి, సాయంత్రం రామలింగేశ్వరుడిని మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను నిత్య తిరుకల్యాణోత్సవం జరిపారు. సుప్రభాత సేవ, తిరువారాధన, ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి నిజాభిషేకం, తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన గావించారు.

### పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో..

భువనగిరి అర్బన్ : కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా పట్టణంలోని పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పూజారి నాగరాజు శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం, అన్న పూజ నిర్వహించారు. గంగిశెట్టి మల్లేశ్ అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు పోత్నక్ ప్రమోద్ కుమార్, కూర వెంకటేశ్, తంగలపల్లి రవికుమార్, కోళ్ల గంగాధర్, ఈరపాక నరసింహ పాల్గొన్నారు.

## ఓటరు జాబితాను పకడ్బందీగా నిర్వహించాలి : ఆర్డీఓ

బీఎల్ఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

వలిగొండ, నవంబర్ 4: ఓటర్ జాబితాను పకడ్బందీగా నిర్వహించాలని బీఎల్ఓలకు ఆర్డీఓ కృష్ణారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం బీఎల్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఓటరు జాబితాలో మార్పు, చేర్పుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐలు కరుణాకర్‌రెడ్డి, మనోహర్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## బాల కార్మిక నిర్మూలనపై సదస్సులు చేపట్టాలి : మాధవీలత

బాల కార్మిక అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాధవీలత

భువనగిరి అర్బన్, నవంబర్ 4 : బాల కార్మిక నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలతా అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక నిర్మూలన, రక్షణ, పునరావాసం అవగాహన, కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల కార్మిక నిషేధ చట్టం, శిక్షలపై విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సైదులు, ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్, న్యాయవాదులు ఎస్. జైపాల్, జి.శంకర్, పీఎల్‌వీలు రాంబాయి, శ్రీశైలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డుకు మరమ్మతులు చేయించాలని విద్యార్థుల నిరసన

తుర్కపల్లి : సంగ్యాతండా వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తుర్కపల్లి, నవంబర్ 4 : గుంతలమయంగా మారిన భువనగిరి– గజ్వేల్ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతూ మండలంలోని సంగ్యాతండా వద్ద సోమవారం విద్యార్థులు నిరసన తెలిపారు. లంబాడా హక్కుల ఫోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంతోశ్ నాయక్ మాట్లాడుతూ భువనగిరి– గజ్వేల్ రహదారిపై రుస్తాపురం నుంచి ముల్కలపల్లి వరకు రోడ్డు పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారిందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు.

భువనగిరి అర్బన్ : భువనగిరి – గజ్వేల్ రోడ్డుపై ఆదివారం రాత్రి బైక్‌పై యువకుడు స్వర్గమానికి వెళ్తుండగా అదుపుతప్పి కింద పడడంతో గాయాలయ్యాయి. సంతోశ్‌కుమార్ యువకుడిని పరామర్శించి మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు మరమ్మతులు చేయాలన్నారు.

## మెరుగైన వైద సేవలు అందించాలి

● డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని

పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని

బీబీనగర్, నవంబర్ 4 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం ఆమె సందర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, ఫిజియో థెరిపీ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా భువనగిరి పట్టణంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి దంత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 4 : పట్టణంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డ రావుల నగేశ్, అనారోగ్యంతో మృతి చెందిన మారేపల్లి శేఖర్ కుటుంబాలకు స్థానిక అభినవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 100కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను సోమవారం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జోగు రవీందర్, సాయికుమార్, నరేశ్, సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

రవితేజ (ఫైల్)

ఆలేరురూరల్, నవంబర్ 4 : మండలంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. ఆలేరు పట్టణానికి చెందిన రాపోలు రవితేజ (23) బీ ఫార్మిసీ సెకండియర్ చదువుతున్నాడు. మండలంలోని టంగుటూరు గ్రామ శివారులో గల ఓ రిసార్టులో 10వ తరగతి మిత్రులతో కలిసి గెట్ టూ గెదర్ పార్టీ చేసుకుంటున్నారు. తన ఫ్రెండ్స్‌కు భోజనం తేవడానికి బైక్‌పై మరో స్నేహితుడు కట్కం సంజయ్‌తో కలిసి టౌన్‌కి వెళ్లి తిరిగి రిసార్ట్‌కు వస్తుండగా టంగుటూరు శివారులోకి రాగానే శారాజీపేట నుంచి ఆలేరుకు వస్తున్న గుర్తు తెలియని వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో రవితేజకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందగా.. సంజయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి తండ్రి ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజనీకర్ తెలిపారు.

## పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ రికార్డుల పరిశీలన

వలిగొండ, నవంబర్ 4 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీసీపీ రాజేశ్‌చంద్ర సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసుల వివరాలు తెలుసుకొని, క్రైం కేసులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏసీపీ మధుసూధన్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ యుగంధర్ ఉన్నారు .

## కలుషిత నీటి నివారణకు చర్యలు తీసుకోవాలని వినతి

మోత్కూరు, నవంబర్ 4 : పట్టణంలోని పెద్ద చెరువు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల రాజకీయ పార్టీ ప్రతినిధులు సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీలను పెద్ద చెరువులో కలిపే విధంగా పైప్ లైన్ ఏర్పాటు చేశారని, చెరువు నీళ్లు కలుషితమై డ్రైనేజీ కంపుతో మూగజీవాలకు తాగునీరు కరువైందన్నారు. ఎఫ్‌టీఎల్ గుర్తించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఎడ్ల నరేశ్, పంజాల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు జనార్దన్ పాల్గొన్నారు.

## అదనపు కట్నం వేధింపులు తాళ లేక వివాహిత ఆత్మహత్య

బీబీనగర్, నవంబర్ 4 : మండలంలోని గొల్లగూడెంలో అదనపు కట్నం వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ ఎన్. రమేశ్ తెలిపిన వివరాలు.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మాకెల గణేశ్‌కు, రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన స్వప్న(34)తో పదేండ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త, బావ రమేశ్‌తో పాటు, అత్త లక్ష్మమ్మ గత కొన్ని రోజులుగా అదనపు కట్నం కోసం స్వప్నను వేధింపులకు గురి చేస్తున్నారు. వేధింపులు తాళలేక సోమవారం ఇంట్లో అందరు పొలానికి వెళ్లిన సమయం చూసి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## బ్యుటీషియన్ కోర్సుకు దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 4 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో బ్యుటీషియన్ కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలల పాటు సాగే ఈ కోర్సుకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, పాస్ ఫొటో, ఆధార్ కార్డ్‌తో ఈనెల 11న ఉదయం 10 గంటలకు సంస్థలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. శిక్షణతో పాటు హాస్టల్ వసతి కల్పించబడునని తెలిపారు. వివరాలకు 91339 08000, 91339 08111, 9133908222, 9948466111 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## రికవరీ ఫోన్ అందజేత

ఆత్మకూరు(ఎం), నవంబర్ 4 : మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన కన్నెబోయిన కవిత ఫోన్‌ను అక్టోబర్ 4న గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీపీఐఆర్ సహకారంతో లోకేషన్ ట్రేస్ చేసి సూర్యాపేటలో ఫోన్‌ను దొరకబట్టారు. బాధితురాలికి సోమవారం ఫోన్ అందించారు.

## టెంపుల్‌సిటీపై ట్యాంకర్ బొల్తా.. డ్రైవర్ మృతి

యాదగిరిగుట్ట, నవంబర్ 4 : పట్టణంలో సోమవారం వాటర్ ట్యాంకర్ బొల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గజ్జి నర్సింహ(43) వ్యాటర్ ట్యాంకర్‌ను నడుపుకుంటూ పట్టణంలోని టెంపుల్ సిటీపైకి వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ట్యాంకర్ బోల్తా పడడంతో డ్రైవర్ నర్సింహకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

## మెస్ చార్జీల పెంపుపై హర్షం

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 4 : ప్రభుత్వం విద్యార్థులకు మెస్ చార్జీల పెంపును హర్షిస్తూ మండలంలోని అనంతారం మహాత్మా జ్యోతిబా పూలే డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులు సోమవారం కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత, నరేశ్ పాల్గొన్నారు.

# మూసీ పరిశీలనకు రానున్న సీఎం రేవంత్

రామన్నపేట : ఇంద్రపాల నగరంలో పెద్ద చెరువును పరిశీలిస్తున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

వలిగొండ/రామన్నపేట, నవంబర్ 4 : మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణలో భాగంగా వలిగొండ మండలంలోని నాగారం, సంగెం గ్రామాల వద్ద మూసీ నదిని పరిశీలించడానికి ఈనెల 8వ తేదిన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ రాజేశ్‌చంద్ర ఆయా ప్రదేశాలను సోమవారం సందర్శించారు. వలిగొండ మండలంలోని నాగారం గ్రామ సమీపంలో గల ఆసీఫ్‌నెహర్ కాల్వ, తుమ్మలగూడెం చెరువును, రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం చెరువును డీసీపీ రాజేశ్‌చంద్ర పరిశీలించారు. సంగెం గ్రామ పరిధిలోని భీమలింగం కత్వా వద్ద నది ప్రాంతాన్ని అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శేఖర్ రెడ్డి, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ యుగంధర్ పాల్గొన్నారు.

### హెలిప్యాడ్‌ను పరిశీలన

యాదగిరిగుట్ట : యాదాద్రి లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకునేందుకు సీఎం రేవంత్ వస్తున్నందున కొండకింద పార్కింగ్, టెంపుల్ సిటీ వద్ద గల హెలీప్యాడ్‌ను కలెక్టర్ హనుంతరావు సోమవారం పరిశీలించారు. ఆయన వెంట ఏసీ వీరారెడ్డి, తాసీల్దార్ దేశ్యా నాయక్ ఉన్నారు.

### మిషన్ భగీరథ పైలాన్‌కు శంకుస్థాపన చేయనున్న సీఎం

యాదగిరిగుట్ట, నవంబర్ 4 : మిషన్ భగీరథ పథకం కింద మల్లన్నసాగర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాకు తాగునీటిని అందించేందుకు కావాల్సిన బ్యాలెన్సింగ్ పైపులైన్ పనులకు ఈ నెల 8న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. పైపులైన్ పూర్తయితే జిల్లాలోని 594 అవాస గ్రామాలకు మిషన్ భగీరథ పథకం కింద మల్లన్నసాగర్ జలాలు అందనున్నాయి.

## పది రోజుల్లో బునాదిగాని కాల్వ నిర్మాణానికి టెండర్లు : ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు : పాటిమట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, నవంబర్ 4 : జిల్లాలో అసంపూర్తిగా ఉన్న బునాదిగాని కాల్వ నిర్మాణానికి పది రోజుల్లో ప్రభుత్వం టెండర్లు పిలవనుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని పాటిమట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తాసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ నిరంజన్ వలి, ఏఓ కీర్తి, ఏపీఎం వెంకటేశ్వర్లు, సంధ్య, వెంకటేశ్వర్లు, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

● మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేఖ

భువవనగిరి : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేఖబాబూరావు

భువనగిరికలెక్టరేట్, నవంబర్ 4 : ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కనుకుంట్ల రేఖబాబూరావు అన్నారు. మండలంలోని రెడ్డినాయక్‌తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చిన్నం శ్రీనివాస్, పిట్టల రజిత, తాడూరి, రమేశ్‌నాయక్, మాజీ సర్పంచ్ మంజునాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఆలేరురూరల్ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తాసీల్దార్ అంజిరెడ్డి అన్నారు. మండలంలోని రాఘవాపురం, కొలనుపాక గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు ఇన్‌చార్జి మధు, రైతులు తదితరులున్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని గుడిమాల్కపురం, సర్వేల్, జనగాం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి జైపాల్ రెడ్డి సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ పావని, ఏఈఓ ఉన్నారు.

## మహిళా సంఘాల సొమ్ము స్వాహా

● న్యాయం చేయాలని రోడ్డెక్కిన బాధ